# సాక్షి కామారెడ్డి

ఆదివారం । 20 । జూలై । 2025






## రేషన్‌కార్డులతో..

రేషన్‌కార్డులతో పేదలు అనేక సంక్షేమ పథకాలను పొందవచ్చని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



## సమస్యల పరిష్కారం కోసం..

నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /22.4

## వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

## న్యూస్‌రీల్

### గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కామారెడ్డి అర్బన్ :** కామారెడి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, కంప్యూటర్ సైన్స్ పోస్టులు మూడేసి చొప్పున, ఫారెస్ట్రీ, ఇంగ్లిష్ రెండు చొప్పున, హిందీ, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బీబీఏ, ఫిషరీస్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 24న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

**ఐటీఐ, ఏటీసీల్లో సీట్లకు..**

**కామారెడ్డి అర్బన్:** ఐటీఐ, ఏటీసీల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు బిచ్కుంద ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ప్రమోద్‌కుమార్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కోటేశ్వర్లు ఒకప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ విభాగంలో 13 సీట్లు, ఎలక్ట్రికల్ వెహికల్ మెకానిక్–6, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్ –39, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైర్ మెకానికల్–20, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్ –40, అడ్వాన్స్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్–24, ఆర్టిషన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్ విభాగంలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 98667 57695, 96402 28856 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

### 'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



**కామారెడ్డి టౌన్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి జెడ్పీ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరు పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రి అభ్యర్థులను ఓడించి వెంకటరమణారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించిన చరిత్ర కామారెడ్డి ప్రజలదని గుర్తు చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ పోటీకి సిద్ధంగా ఉందన్నారు. పోటీలో ఉన్న నాయకులకు ప్రతి ఒక్కరు సహకరించి ముందుండి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల ప్రభారి ఆకుల విజయ, జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే అరుణతార, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, రంజిత్ మోహన్, పైలా కృష్ణారెడ్డి, మర్రి రాంరెడ్డి, నాయకులు పైడి ఎల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, విపుల్, మండల అధ్యక్షులు, స్థానిక సంస్థల ఎన్నికల మండల కన్వీనర్లు, ప్రభారీలు పాల్గొన్నారు.

# చైతన్య గళాలు!



సీజనల్ వ్యాధులపై చలపతి రాసి, పాడిన గేయాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ (ఫైల్)

- వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేస్తున్న చలపతి
- అమ్మలాంటి అడవికి ముప్పు కలిగించవద్దంటున్న రమేశ్
- పిల్లలను బడిబాట పట్టించాలంటున్న తగిరంచ
- నో మోర్ డ్రాపవుట్స్ అంటున్న అఖిల్
- పాటలతో సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

**సామాజిక చైతన్యం కోసం ఆ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తపిస్తున్నారు.** కలానికి పదును పెట్టి, తాము పనిచేస్తున్న శాఖకు సంబంధించి వివిధ అంశాలపై చైతన్య గీతాలు రాసి ఆలపిస్తున్నారు. ఈ ప్రయత్నాన్ని అధికారులూ ప్రోత్సహిస్తున్నారు.

సండే స్పెషల్

**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి :** జిల్లాలో పలువురు అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ కలానికి, గళానికి పని చెప్పారు. రోగాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ వైద్య శాఖలో పనిచేసే బి.చలపతి విశ్వకర్మ పాటలు రాసి పాడుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అడవులకు నిప్పు పెడితే కలిగే అనర్థాలను వివరిస్తూ అటవీ శాఖ అధికారి వి.రమేశ్ రాసిన పాడిన పాటలు కనువిప్పు కలిగిస్తున్నాయి. చదువు మానేసిన విద్యార్థులను బడిబాట పట్టించడానికి తగిరంచ నర్సింహారెడ్డి అనే ఉపాధ్యాయుడు 'బడి బాట పట్టిద్దామంటుంటే'.. బడి మానేసినోళ్లు ఉండొద్దంటూ సీహెచ్ అఖిల్ అనే ఉపాధ్యాయుడు 'నో మోర్ డ్రాపవుట్స్' అనే షార్ట్ ఫిలిం రూపొందించారు. వీరు చేస్తున్న ప్రయత్నాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తోపాటు ఆయా శాఖల అధికారులు కూడా వారిని ప్రోత్సహిస్తున్నారు.

### దోమల దండొచ్చె జాగ్రత్త..

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఆరోగ్య విస్తీర్ణాధికారిగా పనిచేస్తున్న బి.చలపతి విశ్వకర్మ వివిధ అంశాలపై ప్రజలను చైతన్యపరిచే పాటలు రాస్తూ పాడుతున్నారు. ఇటీవల కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా 'జాగ్రత్త జాగ్రత్త దోమలదండొచ్చె.. దండిగా దాడులు చేయవచ్చే..' అన్న గేయాన్ని రూపొందించారు. కరోనా కాలంలో 'కరోనా మహమ్మారి కాచి ఉంది కాటువేయ.. కంటికి కానరాని పాడు రోగము ఒంటికి కీడు చేయు పాడు రోగమూ' అంటూ గేయాన్ని పాడి ఆడియో ద్వారా అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై 'తల్లిపాలే తరగని ధనం.. ప్రతి శిశువు తనువుకు..' అనే గేయాన్ని ఆలపించారు. 'పురుటి నొప్పుల కాన్పులే మేలు ఆపరేషన్ కాన్పులకంటే ' అంటూ సిజేరియన్ల వల్ల అనర్థాలపై పాట రాసి పాడారు. కుటుంబ నియంత్రణ కోసం 'ఎందాకా ఎదురు చూపులు ఏ కొడుకు కోసమో కోటి ఆశలతో' అనే గేయం, మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం అందించే పథకాలను వివరిస్తూ 'మాతృత్వపు మాధుర్యము మధుర స్మృతులను నింపగా' అనే పాట రాశారు. ఇలా అనేక ఆరోగ్య సమస్యలపై, సామాజిక సమస్యలపై ఆయన పాటలు రాసి పాడుతూ ఆయా అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



### వద్దురా.. అడవికి నిప్పురా..

అటవీ శాఖ కామారెడ్డి రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వి.రమేశ్ 'వద్దురా.. అడవికి నిప్పురా' అంటూ కనువిప్పు కలిగించేలా పాటను రాసి, పాడి సీడీ రూపంలో తీసుకువచ్చారు. అడవిలో నిప్పు పెట్టడం వల్ల ఫల వృక్షాలు, పెద్ద పెద్ద చెట్లు కాలిపోతాయని, వన్యప్రాణులకు ముప్పు ఏర్పడుతుందని ఆ పాటలో వివరించారు. అటవీ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల గురించి 'అడవి మొత్తం తిరుగుతున్న.. అలసిపోతావున్న' అంటూ పాట రాసి పాడారు. 'ఏమిచ్చి నీ రుణం తీర్చనూ చెట్టమ్మా..' అంటూ చెట్టు ద్వారా జీవకోటికి కలిగే ప్రయోజనాలను వివరించారు. 'రారో రాజన్న', 'వందనం.. వందనం.. అభివందనం', 'వందనాలు వందనాలు ఓ అటవీ సైనికా', 'ఓ అడవి సైనిక ఈ అడవి మనదిరా..' అంటూ పలు పాటలు రాశారు. 15 పాటలు రాసిన రమేశ్, ఆరు పాటలను రికార్డు చేసి విడుదల చేశారు. అలాగే సామాజిక అంశాలపైనా ఆయన ఎన్నో పాటలు, కవితాలు రాశారు.



### నో మోర్ డ్రాపవుట్స్..

లింగంపేట మండలం ఎక్కపల్లి ప్రైమరీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న అఖిల్.. 'నో మోర్ డ్రాపవుట్స్' పేరుతో షార్ట్ ఫిల్మ్ రూపొందించారు. బడి మానేసినవారిని తిరిగి పాఠశాలలో చేర్పడం గురించి ఇందులో వివరించారు. ఏఐ ఆధారిత అభ్యాసాన్ని ఉపయోగించడం ద్వారా ప్రయోజనాలను వివరించారు. ఈ షార్ట్ ఫిల్మ్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. షార్ట్ ఫిల్మ్ రూపొందించిన అఖిల్‌ను పలువురు అభినందించారు.

### బడిబాట పట్టిద్దాం..

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తగిరంచ నర్సింహారెడ్డి అనే ఉపాధ్యాయుడు 'మన ఊరి బడి.. ఇది అమ్మ ఒడి.. పలకా బలపం చేతబట్టి అఆఇఈ దిద్దించిన గుడి.. అంటూ బడిని గురించి తన పాటలో వివరించారు. అలాగే చేర్పిద్దాం మన పిల్లలను మన ఊరి సర్కారు బడిలోనే' అంటూ సర్కారు బడి గొప్పతనాన్ని తన పాటలో వివరించారు. బడిబయట ఉన్న పిల్లలను 'బడిబాట పట్టిద్దాం' అంటూ మరోపాట రాశారు. నర్సింహారెడ్డి గజల్ కవిగానూ గుర్తింపు పొందారు. సామాజిక అంశాలపైనా కవితలు, పాటలు రాస్తారు. వివిధ అంశాలపై షార్ట్ ఫిలిమ్స్ తీస్తున్నారు.



## ఒత్తిడిని జయించలేక..

- తనువు చాలించిన ఇంటర్ విద్యార్థి
- అర్థం కాని ఆంగ్లమాధ్యమ చదువు
- పదో తరగతి వరకు తెలుగు మీడియంలో విద్యాభ్యాసం

**నిజాంసాగర్/ఆర్మూర్ టౌన్ :** పదో తరగతి వరకు తెలుగు మీడియం చదువుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థి ఇంటర్‌లో ఆంగ్లమాధ్యమ చదువు అర్థంకాక తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. చివరికి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. నిజాంసాగర్ మండలం ఆరేడ్ గ్రామానికి చెందిన గడ్డం నిర్మల, నాగయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. రెక్కల కష్టాన్ని నమ్ముకొని పిల్లలను చదివిస్తున్నారు. చిన్న కుమారుడైన సంతోష్ (17) ఐదో తరగతి నుంచి 10 వ తరగతి వరకు అచ్చంపేట ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉంటూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించాడు. తెలుగుమీడియం చదువుల్లో ఉత్తమ మార్కులు సాధించాడు. ఇంటర్మీడియట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో సీటు వచ్చింది. పదో తరగతి వరకు తెలుగు మీడియం చదివి ఇంటర్‌లో ఇంగ్లిష్ మీడియం కావడంతో ఒత్తిడికి గురయ్యాడు. అయినా ఇంగ్లిష్ మీడియంలో పట్టు సాధించాలనుకున్న సంతోష్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. సప్లిమెంటరీలో ఒకటి మాత్రమే పాస్ కావడంతో మానసికంగా ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. శనివారం వేకువజామున సంతోష్ తాను చదువుతున్న గురుకుల పాఠశాలలో తోటి విద్యార్థులతో కలిసి మైదానంలో వ్యాయామంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. అనంతరం సంతోష్ తువ్వాలు తీసుకుని కళాశాల గోడ దూకి బయటకు వెళ్లినట్లు సమాచారం. కొద్ది సేపటి తర్వాత డిగ్రీ కళాశాల వెనుక గల నర్సరీలో సంతోష్ తువ్వాలుతో చెట్టుకు ఉరి వేసుకుని కనపడ్డాడు. ఇదిలా ఉండగా సంతోష్ ఆత్మహత్యపై అతడి సోదరుడు శ్రీకాంత్ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వేల్పూర్ కళాశాలలో చాలామంది ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు వచ్చి రెండు నెలలవుతోందని, ఇప్పుడెందుకు ఆత్మహత్య చేసుకుంటాడని ప్రశ్నిస్తున్నారు. కళాశాలలో ఏం జరిగిందో తెలుసుకోవడానికి విచారణ జరిపించాలని కోరారు.

సంతోష్ ఆత్మహత్యతో ఆరేడ్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలుపుగోలుగా ఉంటూ చదువుల్లో చురుకుగా ఉండే సంతోష్ మరణాన్ని బంధు మిత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.



సంతోష్ (ఫైల్)

## ఆర్టీసీ బస్సు, ఇసుక లారీ ఢీ



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్



రోడ్డు కిందికి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



క్షతగాత్రులకు వైద్య సేవలందిస్తున్న అంబులెన్సు సిబ్బంది

- రోడ్డు కిందికి దూసుకెళ్లిన బస్సు
- పలువురికి తీవ్ర గాయాలు
- భయాందోళనలకు గురైన ప్రయాణికులు

**లింగంపేట:** ఎదురెదురుగా వస్తున్న ఇసుక లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం లింగంపేటవైపు నుంచి కామారెడ్డి వైపు ఆర్టీసీ బస్సు వెళ్తోంది. బస్సులో 102 మంది ప్రయాణికులున్నారు. అదే సమయంలో కామారెడ్డి వైపు నుంచి లింగంపేట వైపు ఇసుక లారీ వస్తోంది. లింగంపేట మండలం ఎల్లమ్మతండా సమీపంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సు రోడ్డు కిందికి దూసుకుపోయింది. ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. లారీ డ్రైవర్ లింగంపేట మండలం పర్మళ్ల గ్రామానికి చెందిన బద్ద నాగరాజు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. అతడి కుడి కాలు విరిగింది. బస్సు డ్రైవర్ వడ్ల శ్రావణ్‌కుమార్‌కూ గాయాలయ్యాయి. ఆయన స్వస్థలం లింగంపేట మండలం కొర్పోల్ గ్రామం. కండక్టర్ శంకర్‌రావుతోపాటు ప్రయాణికులు బూక్య మంజుల(అన్నారం), ఉంట గంగారెడ్డి(మర్కంటి), కుంట బాలరాజవ్వ(మర్కంటి), పురుషోత్తం(డిచ్‌పల్లి), పోచయ్య(కస్‌కల్), లింగమొల్ల రాజు(శెట్పల్లిసంగారెడ్డి), స్రవంతి(పోతారం), సత్తవ్వ(శెట్పల్లిసంగారెడ్డి), చాకలి రాజేష్(కుప్రియాల్), నక్క రాజమణి(దూస్‌గావ్), బ్రహ్మణపల్లి లక్ష్మి(తాడ్వాయి), అల్లిపురం అంజవ్వ(కాళోజీవాడి), పడమటి సుశీల(ఆరెపల్లి)లకు గాయాలయ్యాయని ప్రయాణికులు తెలిపారు. వీరిని సదాశివనగర్, దోమకొండ, రాజంపేట మండలాలకు చెందిన 108 అంబులెన్సులలో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, లింగంపేట ఎస్సై దీపక్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంతో కామారెడ్డి, ఎల్లారెడ్డి కేకేవై మార్గంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. నల్లమడుగు, మోతె మీదుగా కామారెడ్డికి వాహనాలు వెళ్తుండగా మార్గమధ్యలో గుర్జాల్ వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి

- గ్రామస్వరాజ్యమే దేశ స్వరాజ్యం
- సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుకు కృషి చేయాలి
- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య, వేదికపై కలెక్టర్లు ఆశిష్ సంగ్వాన్, వినయ్‌కృష్ణారెడ్డి

**నిజామాబాద్‌అర్బన్:** గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో ఆర్థిక సంఘం సభ్యులు ఎం రమేశ్, సంకెపల్లి సుధీర్‌రెడ్డితో కలిసి చైర్మన్ రాజయ్య సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు టి.వినయ్ కృష్ణారెడ్డి, ఆశిష్ సంగ్వాన్‌లు ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల పనితీరును చైర్మన్‌కు వివరించారు. మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ద్వారా విడుదల అయిన నిధులు, వాటి వెచ్చింపు వివరాలను గణాంకాల ద్వారా వెల్లడించారు.

ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకుని, పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని అన్నారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణంతో అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని స్పష్టం చేశారు. కొత్త గ్రామ పంచాయతీలుగా మారిన తండాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వీధి దీపాలకు సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తే బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని అన్నారు. ప్రయోగాత్మకంగా చిన్న గ్రామ పంచాయతీల్లో సోలార్ విద్యుత్ విధానాన్ని అమలు చేస్తూ, క్రమంగా అన్ని స్థానిక సంస్థలకు విస్తరిస్తూ నిజామాబాద్ ఉమ్మడి జిల్లాను ఆదర్శంగా నిలపాలని సూచించారు. అదేవిధంగా నిధుల కోసం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఆధారపడకుండా ఆదాయం సమకూర్చే అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల్లో ఆదాయ వనరులు పెంపొందించుకునేందుకు ఉన్న అవకాశాలపై అధికారుల నుంచి సలహాలు స్వీకరించారు. వాటన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, చందర్ రాథోడ్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్‌లు, జెడ్పీ సీఈవోలు, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### స్వాగతం..

ఉమ్మడి జిల్లా సమీక్షకు హాజరైన ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు టి.వినయ్ కృష్ణారెడ్డి, ఆశిష్ సంగ్వాన్, నిజామాబాద్ సీపీ సాయి చైతన్య తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.

## మడిలో 'సాగు' పాఠం



**మాచారెడ్డి:** లచ్చపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. నారు మడిలోకి దిగి సాగు పాఠాలు నేర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు లచ్చిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ అనుభవం ద్వారా వరి నాట్లు వేసే విధానంపై అవగాహన పెంపొందించుకున్నారన్నారు. తర్వాత వారి తల్లిదండ్రులు పడుతున్న శ్రమను అర్థం చేసుకోగలిగారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగారెడ్డి, శ్రీనివాస్, బారి నాయుడు, రాజేశ్వరి, రమేశ్, కురేషియా, మోహిన్, నర్సింలు పాల్గొన్నారు.

## ఉప్పొంగిన గుర్జాల్‌వాగు

వంతెనపైనుంచి పారిన వరద.. ✤ కాసేపు నిలిచిన రాకపోకలు



వంతెన పైనుంచి ప్రవహిస్తున్న గుర్జాల్‌వాగు

**గాంధారి:** గుర్జాల్– వండ్రికల్ గ్రామాల శివారులో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి గుర్జాల్‌వాగు వంతెన పైనుంచి నీరు ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలు కాసేపు నిలిచిపోయాయి. కామారెడ్డి – లింగంపేట ప్రధాన రహదారిపై బస్సు, లారీ ఢీకొనడంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఈ మార్గంలో మళ్లించారు. వాగుపైనుంచి నీరు పారడంతో సుమారు గంటపాటు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ప్రవాహ ఉధృతి తగ్గిన తర్వాత రాకపోకలు యథావిధిగా సాగాయి.

**వాగవతల చిక్కుకున్న గ్రామస్తులు..**

**సదాశివనగర్:** అమర్లబండ వాగు శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి ప్రవహించింది. దీంతో పొలాలకు వెళ్లినవారు గ్రామంలోకి తిరిగి రావడానికి ఇబ్బందిపడ్డారు. దీంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన గ్రామస్తులు పంచాయతీ ట్రాక్టర్‌ను తీసుకెళ్లి వాగు అవతలి వైపు ఉన్న రైతులను తీసుకునివచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు.

## క్లుప్తంగా

### పేదలకు రేషన్ కార్డులతోనే సంక్షేమ పథకాలు



బాన్సువాడ రూరల్: పేదలు రేషన్‌కార్డుల వల్ల అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందవచ్చని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో సాధ్యంకాని పని ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాప్రభుత్వంతో సాధ్యమైందన్నారు. బాన్సువాడలోని రెడ్డి సంఘంలో శనివారం బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కొత్త రేషన్‌కార్డులను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, సబ్ కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూడు మండలాలకు 1599 రేషన్ కార్డులు మంజూరు అయ్యాయన్నారు. ధనవంతులు, స్థితిమంతులు తమ రేషన్‌కార్డులను ప్రభుత్వానికి సరేండర్ చేయాలని విజ్ఞప్తిచేశారు. బాన్సువాడ, బీర్కూర్ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, దుర్గం శ్యామల, నాయకులు జంగం గంగాధర్, అంజిరెడ్డి, మహ్మద్ ఎజాస్, నార్ల సురేష్ ,గౌస్ తదితరులు పాల్గొన్నారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



ఎల్లారెడ్డి: బ్యాంకు మేనేజర్లు తమ శాఖలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన బ్యాంకు అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల బ్యాంకులు తమ శాఖలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, భద్రతా పరంగా పోలీసులకు సహకారం అందించాలని సూచించారు. ఎస్సైలు మహేష్, భార్గవ్, దీపక్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

### గోల్డ్‌లోన్ ఫైనాన్స్ కార్యాలయాల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని పలు గోల్డ్ ఫైనాన్స్ కార్యాలయాలను ఎస్సై మహేష్ శనివారం పరిశీలించారు. కార్యాలయాల చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అలారం పనిచేస్తున్న తీరును ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. ఫైనాన్స్ సిబ్బంది, పోలీసులు తదితరులున్నారు.

### స్టాక్ రిజిస్టర్, ధరల పట్టిక ఉండాలి



బాన్సువాడ రూరల్: ఫర్టిలైజర్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టిక తప్పక ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను శనివారం ఆయన తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి మందుకు, విత్తనాలకు బిల్లులు ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచించారు. అంతకుముందు ఆయన బదిలీపై వచ్చి, తొలిసారి బాన్సువాడకు రావడంతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఏవో ఫయాజుల్లా ఉన్నారు.

# పెట్రోల్ బంకుల్లో గోల్‌మాల్!

- ఇందనం తక్కువ పోసేలా యంత్రాల్లో మార్పులు చేస్తున్నారనే ఆరోపణలు
- తీవ్రంగా నష్టపోతున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు



కామారెడ్డి క్రైం: జిల్లాలోని పెట్రోల్ బంకులపై నిఘా కరువైంది. పెట్రోల్ గానీ, డీజిల్ గానీ వాహనాల్లో పోసే క్రమంలో గోల్‌మాల్ జరుగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇంధనాన్ని పోసే యంత్రాల్లో సెట్టింగ్‌లను తమకు అనుకూలంగా మార్చుకుంటూ వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్న బంకులే ఎక్కువగా ఉన్నాయి. ఖచ్చితమైన పరిమాణంలో పెట్రోల్ రావడం లేదని చాలా మంది వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూకాల్లో జరుగుతున్న మోసాలపై నిఘా కరువైంది. సివిల్ సప్లయ్, తూనికలు కొలతల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

### జిల్లాలో 120కి పైగా బంకులు..

కామారెడ్డి జిల్లాలో 120కి పైగా వివిధ కంపెనీలకు చెందిన పెట్రోల్ బంకులున్నాయి. వాహనాల సంఖ్య, ఇంధన వినియోగం పెరగడంతో పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు ఈ మధ్య గ్రామీణ ప్రాంతాల్లో కూడా కొత్త బంకులు వెలుస్తున్నాయి. కానీ బంకుల నిర్వాహకులు వాహనాల ట్యాంకుల్లో తక్కువ ఇంధనం పడేలా బంకుల్లోని యంత్రాల్లో మార్పులు చేసిన ఘటనలు గతంలో చాలాచోట్ల వెలుగు చూశాయి. ఇటీవలి కాలంలో పెట్రోల్, డీజిల్ పరిమాణాల్లో బంకుల యజమానులు చేతివాటం ప్రదర్శిస్తూ వినియోగదారులను మోసాలకు గురి చేస్తున్నారనే విమర్శలు సర్వత్రా చోటు చేసుకుంటున్నాయి. ఎందుకంటే ఒక్కో బంకులో పోసే పెట్రోల్ ఒక్కో విధంగా మైలేజీని ఇస్తున్నదని వాహనాల యజమానులు పేర్కొంటున్నారు. దీంతో పోసే పెట్రోల్ పరిమాణం తక్కువగా రావవడమే అందుకు కారణం అనే అనుమానాలు బలంగా ఉన్నాయి. ఈ విషయమై బంకుల్లో అడిగితే వాహనాల కండీషన్‌పై తోసేస్తున్నారని వాపోతున్నారు.

### నిఘా కరువు..

బంకుల్లో ఇంధన విక్రయాలు, నిర్వహణ తీరుపై అధికారులు నిరంతరంగా నిఘా ఉంచాల్సి ఉంది. బంకుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చాలా రోజులుగా బంకుల నిర్వహణపై అధికారుల నిఘా లోపించింది. ప్రతి నెల బంకులు, యూనియన్‌ల నుంచి అధికారులకు మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. మామూళ్ల మత్తు కారణంగానే నిఘా కరువైందని విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి పెట్రోల్ బంకుల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని, మోసాలకు పాల్పడుతున్న బంకుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

### తనిఖీలు చేపడుతున్నాం..

సివిల్ సప్లయ్ శాఖ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా తనిఖీలు చేపడుతున్నాం. ఇంధనాన్ని కల్తీ చేస్తున్నట్లుగా ఇప్పటివరకు మా దృష్టికి రాలేదు. ఇంధనం తక్కువగా వస్తుందంటే ఆ విషయాన్ని తూనికలు, కొలతల అధికారులు చూస్తారు. ఏదైనా తేడా అనిపిస్తే వినియోగదారులు వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

– మల్లికార్జున్‌బాబు, డీఎస్‌వో, కామారెడ్డి

# నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం కృషి



జుక్కల్‌లో మహిళా సంఘాలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



పెద్ద ఎక్లారలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్/మద్నూర్/బిచ్కుంద/పెద్దకొడప్‌గల్/: జుక్కల్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం నిత్యం అధికారులతో, ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహించి, కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో శనివారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం. మద్నూర్ మండలంలోని పెద్దఎక్లార గేటు వద్ద విద్యుత్ సబ్ స్టేషన్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. బిచ్కుంద మండలం ఎల్లారంలో నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందించారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని జగన్నాథ్‌పల్లి గ్రామంలో అటవీశాఖ అధికారులు నిర్వహించిన వన మహోత్సవంలో ఆయన మొక్కలు నాటారు. జుక్కల్ మండల కేంద్రంలోని లక్ష్మీకల్యాణ మండపంలో మహిళా శక్తి సంబురాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. పలు మహిళా సంఘాలకు రుణాల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ, అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాన్నారు. మద్నూర్ సొసైటీ చైర్మన్ శీనుపటేల్, పార్టీ అధ్యక్షుడు దరాస్ సాయిలు, వివిధ మండలాల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- తెయూలో ప్రజావాణి నిర్వహణ
- సమస్యలు వివరించిన విద్యార్థులు, అధ్యాపకులు



ప్రజావాణిలో మాట్లాడుతున్న, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గుర్తించిన క్షేత్రస్థాయి ఉన్నత విద్యారంగ సమస్యలను వివరిస్తూ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి అన్నారు. కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ ఎల్.విశ్వేశ్వరరావుతో కలిసి యూనివర్సిటీని మురళి శనివారం సందర్శించారు. బాలికల, బాలుర వసతి గృహాలు, సెంట్రల్ లైబ్రరీ, వివిధ కళాశాలల తరగతి గదులు, ప్రయోగశాలలను పరిశీలించారు. అనంతరం తెయూ వీసీ ప్రొఫెసర్ టీ.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి, కమిషన్ సభ్యులు విశ్వేశ్వరరావుతో కలిసి చైర్మన్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. తెయూకు ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలు మంజూరు చేయించాలని,నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను తెయూ పరిధిలోకి తేవాలని ఈ సందర్భంగా విద్యార్థులు విన్నవించారు.ముఖ్యంగా ఒకటే బాలికల హాస్టల్ ఉందని, మౌళిక వసతులు, గదులు సరిపోక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే నూతన బాలికల హాస్టల్ నిర్మించాలని విద్యార్థినులు కోరారు. ప్రయోగశాలు, గ్రంథాలయంలో పుస్తకాల కొరత తదితర అంశాలను మురళి దృష్టికి తీసుకెళ్లారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ కోచింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని విన్నవించారు. తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) అధ్యక్షులు ఏ.పున్నయ్య మాట్లాడుతూ.. ఉన్నత విద్యారంగంలో క్షేత్రస్థాయిలో అనేక సమస్యలున్నాయన్నారు. దశాబ్ద కాలంగా యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకం జరగడంలేదన్నారు. తెయూ అనుబంధ కళాశాలల రాష్ట్ర సహాయ కార్యదర్శి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని, దీంతో కళాశాలలు నిర్వహించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దోస్త్, బకెట్ సిస్టం వంటి అడ్మిషన్స్ నిబంధనలతో ప్రైవేటు కళాశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, కంట్రోలర్ ప్రొఫెసర్ కే.సంపత్‌కుమార్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, ప్రొఫెసర్ కనకయ్య, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నాగిరెడ్డిపేట మండలంలో కరెంట్ కోత

- విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తాకడంతో మూడుగంటలపాటు నిలిచిన విద్యుత్



పొక్లెయిన్ సహాయంతో చెట్లకొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రం గోపాల్‌పేటతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో శనివారం రాత్రి కరెంట్ సరఫరాలో అంతరాయం నెలకొంది. మండలంలోని మాల్తుమ్మెదగేట్ సమీపంలో చెట్లకొమ్మలు విద్యుత్ వైర్లకు తగటడంతో మూడు గంటలపాటు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ట్రాన్స్‌కో సిబ్బంది కరెంట్ సరఫరా నిలిచినపోయిన విషయంపై ఆరా తీస్తూ వైర్లను పరిశీలించి, సమస్యను గుర్తించారు. వెంటనే వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను పొక్లెయిన్ సహాయంతో తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

## మరుగుదొడ్ల నిర్మాణ పనులను పూర్తిచేయిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరలో పూర్తిచేయిస్తామని ఏఈ గోపినాథ్ తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారని ఈ నెల 15 సాక్షిలో వచ్చిన కథనానికి అధికారుల స్పందించారు. దీనిలో భాగంగా గుత్తేదారుతో మాట్లాడి త్వరలోనే బిల్లులు మంజూరు చేయిస్తామని ఏఈ గోపినాథ్ హామీ ఇచ్చారు. దీంతో నిర్మాణ పనులు ప్రారంభిచారు. త్వరలోనే మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయిస్తామని ఏఈ అన్నారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వరావు ఉన్నారు.

# ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి





నల్లమడుగులో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు.. కన్నారెడ్డి గ్రామంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీవో మలహరి సూచించారు. మండలంలోని నల్లమడుగు, ఎల్లారం, లింగంపల్లి(ఖుర్దు), కొయ్యగుండు తండా గ్రామాల్లో శనివారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ విషయాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యదర్శులు శ్రీనివాస్, సావిత్రి, ప్రశాంత్, యాసుబ్, భవాని, ఉన్నారు.

**నాగిరెడ్డిపేట మండలంలో..**

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అచ్చాయపల్లి, కన్నారెడ్డి, చీనూర్, జలాల్‌పూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. పీఎంఏవై యాప్‌లో లబ్ధిదారుల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని ఆయన సూచించారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటరాజు, రమేష్, సరేందర్, మల్లిఖార్జున్ ఉన్నారు.

### వీధిదీపం ఏర్పాటు చేయాలని సెల్‌టవర్ ఎక్కి నిరసన



గంగరాజును కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తన ఇంటి ముందు విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేసి వీధిదీపం అమర్చాలని డిమాండ్ చేస్తూ ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కిన ఘటన శనివారం రాత్రి మండలంలోని ధర్మారెడ్డిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా..గ్రామానికి చెందిన జోడు గంగరాజు అనే వ్యక్తి తన ఇంటి ముందు విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించాడు. కానీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గ్రామశివారులోగల సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ ఘటనస్థలానికి చేరుకొని గంగరాజుకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఫోన్‌లో ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడించడంతో టవర్ దిగాడు. అనంతరం పోలీసులు అతడిని కుటుంబసభ్యులకు అప్పగించారు.

## సంక్షిప్తం..

**సమస్యను పరిష్కరించండి**

ఎల్లారెడ్డి: పట్టణంలోని రెండోవార్డు పరిధిలో ఖాళీ ప్రదేశాలు, రోడ్లపై నీరు నిలుస్తోందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు వారు శనివారం సమస్యను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కాలనీ వాసులు మహేష్, అమృత్ తదితరులున్నారు.

**పోలీసుల శ్రమదానం**

భిక్కనూరు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసులు శనివారం శ్రమదానం నిర్వహించారు. స్వచ్ఛ పోలీస్‌స్టేషన్‌లో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలోని చెత్తాచెదారాన్ని, ముళ్లపొదలను తొలగించారు. సీఐ సంపత్‌కుమార్,ఎస్సై అంజనేయులు పాల్గొన్నారు.

**తహసీల్దార్ల బదిలీ**

బాన్సువాడ రూరల్: బాన్సువాడ, బీర్కూర్ మండలాల తహసీల్దార్లు వరప్రసాద్,లత బదిలీ అయ్యారు. బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్‌ను బీర్కూర్‌కు బదిలీ చేశారు. బీర్కూర్ తహసీల్దార్ లతను బాన్సువాడకు బదిలీ చేశారు. ఈమేరకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బదిలీ ఉత్తర్వులను జారీచేశారు.

**డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ**

కామారెడ్డి టౌన్: తెలంగాణ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ సెమిస్టర్–2 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాల విద్యార్థుల అత్యుత్తమ మార్కులు సాధించారు. బీకాంలో మధిహా బేగం 9.92 జీపీఏ, మెహరీన్ ఫాతిమా 9.80, సీరీన్ బేగం , షేక్ షాజియాలు 9.52, బీఎస్సీలో అయోషా సిద్దిక 9.60, స్నేహ 9.52 జీపీఏ మార్కులు సాధించి యూనివర్సిటీ టాపర్లుగా నిలిచారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు హరిస్మరణ్‌రెడ్డి, బాలాజీ రావు, ప్రిన్సిపాల్ సాయిబాబా, మనోజ్‌కుమార్ అభినందించారు.

**మాదిగ యువసేన అడహక్ కమిటీ నియామకం**

కామారెడ్డి టౌన్: మాదిగ యువసేన జిల్లా అడహక్ కమిటీ నియామకం చేపట్టినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంథని సామ్యెల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఆయన కమిటీని ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా చింతకుంట సాయివరుణ్, కో–కన్వీనర్‌లుగా రాజు, పుల్లూరి రాజేందర్, బక్కోల్ల రాజు, కర్రోల్ల రజినీకాంత్‌లను నియమించినట్లు తెలిపారు.

**ఏబీవీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం**



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ఏబీవీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా ప్రతినిధి పవన్‌రెడ్డి విద్యార్థులకు సభ్యత్వం అందజేశారు. నాయకులు సంజయ్, ప్రథమ్, అఖిల్ తదితరులున్నారు.

**పురాతన నాణేలు, స్టాంపుల ప్రదర్శన**



బాన్సువాడ రూరల్: పట్టణంలోని రిపుల్స్ పాఠశాలలో శనివారం పురాతన నాణేలు, కరెన్సీ, స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. బాన్సువాడ పట్టణానికి చెందిన రుద్రంగి గంగాధర్ పాఠశాలలో సుమారు 300 ఏళ్లనాటి నాణేలను ప్రదర్శించారు. స్టాంపులు, సుమారు 189 దేశాల విదేశీ కరెన్సీ, ఇతర విలువైన నాణేలను ప్రదర్శించి వాటి గురించి విద్యార్థులకు వివరించారు. కులకర్ణి ఫాల్గుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పోలీసులను బెదిరించిన వారిపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మదీ బజార్ రోడ్డుపై ఉన్న తోపుడు బండ్లు, షాపులు, రేకులను తొలిగిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌తోపాటు సిబ్బందిని బెదిరించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపారు. షాపులను క్లియర్ చేస్తున్న సమయంలో పోలీసులను నీ అంతు చూస్తామంటూ విధులకు ఆటంకం కలిగించిన షెహబాజ్, మజీద్, హర్షద్, షేక్ ఆద్నాన్, ఖలీద్‌ఖాన్‌తోపాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### ఇసుక టిప్పర్ పట్టివేత

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి వద్ద అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అడవి మామిడిపల్లి వద్ద కాపు కాచి ఆర్మూర్ వైపు నుంచి నిజామాబాద్ వైపు ఇసుకలోడ్‌తో వెళ్తుండగా టిప్పర్‌ను పట్టుకొని బాధ్యుడిపై కేసు నమోదు చేశామన్నారు.

### మంత్రి సీతక్కను కలిసిన నేతలు



నిజాంసాగర్(జుక్కల్): జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను శనివారం హైదరాబాద్‌లో జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ సెల్ కన్వీనర్ అరవింద్, ఓబీసీ కన్వీనర్ రామలింగం మర్యాదపూర్వకంగా కలిశారు. జుక్కల్ నియోజకవర్గ సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరినట్లు అరవింద్ తెలిపారు. నాయకులు జయప్రదీప్, వినోద్, తదితరులు ఉన్నారు.

### డీఈవోకు విద్యార్థి సంఘాల వినతి

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో విద్యార్థుల నుంచి వసూళ్ల చేసిన అడ్మిషన్ ఫీజుకు తిరిగి ఇవ్వాలని విద్యార్థి సంఘాల నాయకులు శనివారం డీఈవో రాజుకు వినతిపత్రం అందజేశారు. బీవీఎం, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు విఠల్, అరుణ్, శ్యాం తదితరులున్నారు.

## క్రైం కార్నర్

# రెండు గ్రామాల్లో దొంగల బీభత్సం

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- ధర్మారావ్‌పేట్, మర్కల్‌లో చోరీకి పాల్పడ్డ దుండగులు



మర్కల్‌లోని ఓ సీసీ ఫుటేజీలో రికార్డయిన దుండగుల దృశ్యం



ధర్మారావ్‌పేట్‌లోని ఓ ఇంట్లో పడి ఉన్న సామగ్రి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్, మర్కల్ గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ధర్మారావ్‌పేట్ గ్రామానికి చెందిన షహరీ బేగం, ఉరుసు పుష్ప, ఒడ్డె రాములు ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. దీంతో దుండగులు ఇంటి తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ముగ్గురు ఇళ్లలో నగదు, బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు బాధితులు పేర్కొన్నారు. మర్కల్ గ్రామానికి చెందిన గుర్రం పుష్ప, శాంత ఇళ్లకు తాళం వేసి ఉండడంతో దుండగులు చోరీకి పాల్పడ్డారు. కాగా, మర్కల్‌లో అర్ధరాత్రి ఓ కాలనీలో తిరుగుతున్న ఐదుగురు వ్యక్తుల దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. మర్కల్, ధర్మారావ్‌పేట్‌లో చోరీకి పాల్పడింది ఒకే ముఠానా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. చోరీకి గురైన నగదు, బంగారం విలువ విచారణలో తెలుస్తుందని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ సంతోష్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, సిబ్బంది ఉన్నారు.

### గుర్తు తెలియని వాహనం ఢీ.. యువకుడి మృతి



శంకర్ మృతదేహం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని శుక్రవారం దేవీ ఆలయం సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. హసకొత్తూర్ గ్రామానికి చెందిన ఇరగదిండ్ల శంకర్(27) ద్విచక్ర వాహనంపై కమ్మర్‌పల్లికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో శుక్రవారం దేవీ ఆలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

### పోచంపాడ్‌లో కార్డన్ సెర్చ్



బాల్కొండ:మెండోరా మండలం పోచంపాడ్‌లో శనివారం సాయంత్రం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనాల ను సీజ్ చేశారు.వాహనాలు నడిపేవారు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, మెండోరా ఎస్సై సుహాసిని,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.